# జైనుల మతకథలు

పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి గారు

[౧౦. పంచనమస్కారకథ]

శ్లో. తొం చేవ్వ మోఖ్ఖపదవీ, తొం చియ సరణం జణస్స సవ్వస్స,
తొం ణిక్కారణవిద్దో జాయిజరామరణవాహిహరో.†  —పంచనంద్యాచార్యుఁడు.

విక్కలీ ప్రసిద్ధిపొందిన దేశాలల్లో పూర్వకాలాన అంగదేశం వొకటి. మనకథజరిగిన కాలంలో అంగదేశాన్ని పాలిస్తూన్న రాజు పేరు నరవాహనదత్తుడు. నరవాహనదత్తుడన్న పేరు కొంచెం రాజసాన్ని కనపరుస్తూన్నా, పరిపాలనకార్యాలు ఆలోచిస్తే ఆ పేరు శుద్ధసాత్త్వికాన్ని వెల్లడిస్తూ (నరులకు వాహనుడు-అనగా ప్రజలప్రేమకు పాత్రుడు) ఉండేదని పెద్దలు చెబుతుంటారు. అసలే మాంఛీ తెలివితేటలు కలవాడాయె. అప్పైని ప్రజాప్రేమా ఆస్తికత్వం — మొదలయిన వన్నీ వుండటంచేతా, అంధర్నీ సమానంగా చూసుకోవడం చేతా ఆరాజుపరిపాలనా అంటే మహా ఆనందం ప్రజలకు.

ఇల్లా వుండగా నరవాహనదత్తుడి రాజ్యానికంథా అలంకారప్రాయమైన చంపాపట్నంలో వృషభదాసు- అని వక కోమటి మహాపుణ్యాత్ముడు వుండేవాడు. పుణ్యాత్ముడంటే పుణ్యాత్ముడా! ఎప్పుడూ జినస్మరణే. ఏప్పుడు చూసినా జినసేవయే. జినకథాశ్రవణమే. రాత్రుళ్లూ పగళ్లూ విధీవిరామం లేకుండా ఎంతెంత మందో భక్తులు సన్యాసులు పండితులు మొదలయిన పెద్దలందరూ రావడం, నానావిధాలయిన మతసంభాషణల్తో కాలక్షేపం జరగడం—ఇదీ ఆయనపని. దీనికి తగ్గట్టే ఆయనభార్యాగారుకూడా—ఆమె పేరు అర్హద్దాసీలేండి—అమితదైవభక్తి గలది. భర్తచేసే ప్రతీపన్లోనూ ఆకునకుతొడిమెలాగా అంటుకూనే వుంటుందీ. కాబట్టే అనుకూలమైనదాంపత్యంకంటే మించిన పుణ్యలోకం లేదంటారు; పెద్దలు.

వృషభదాసు చాలా సంపన్నుడూ. కావలసినంత నౌకరీచాకరీలు కలవాడూ; ఆపైన పెద్దసెట్టికూడాను. ఆయనదగ్గఱ ఉద్యోగం దొరుకుతుందంటే ఉబ్బిపోని వాళ్లు ఎవ్వరూ ఉండరంటే నమ్మండి. అంతప్రేమతో సేవకులను ఆదరిస్తాడన్నమాట. వృషభదాసుదగ్గఱ ఉండే సేవకులలో గోపాలుడుకూడా వకడు. వాడిపని ఎప్పుడూ అతనిపశువులను మేపుకోరావడం. ప్రతిరోజూ పొద్దుటే లేచి పశువులు తోలుకోపోయి మేపుకోని వస్తూంటాడువిసుగులేకుండా. ఇల్లా వుండగా వకనాడు మామూలుకు మళ్లే అడవికిపోయి వస్తూంటేగా దోవలో మాంచి మంచులో కూచోని కదలకుండా మెదలకుండా సమాధిలో వున్న చారణయోగినిమాశాడు గోపాలుడు. గడగడ వణికిపొయ్యేచలిలో—ముద్దలు ముద్దలుగా మంచుపడుతూన్న బయలులో—చివఱకు గోచీ అయినా లేకుండా నిశ్చలంగావున్న ఆమున్ని చూశేప్పటికి గోపాలుడుహృదయం నీరైపోయింది. కాని ఏంచెయ్యడానికికూడా తోచలేదు. తనదగ్గరా బట్టాపాతా ఏమీ లేవాయె అతనికి కప్పడానికీని. పైగా అతన్నిగుఱించి జాలిపడుతుం

†ఛాయ:—శ్లో. త్వం చైవ మోక్షపదవీ, త్వంచైవ శరణం జనస్య సర్వస్య, త్వం నిష్కారణవైద్యో, జాతిజరామరణవ్యాధిహరః.

అర్థము:—ఓజినదేవా! మాకునీవే మోక్షమార్గం. సర్వజనానికిన్నీ నీవే దిక్కు. (మాబోంట్లకు) నీవే నిష్కారణవైద్యుడు. జాతి జరా మరణం రోగం—మొదలయినవాటి నన్నీ హరించేవాడవు.

డగానే ప్రొద్దు వాలిపోతున్న దాయెను. ఏంచెప్మా అను కుంటూ చాలాసేపు అక్కడ్నే నిలుచున్నాడు. ఎంతసేపు నిలుచున్నా కొయ్యబొమ్మ తెచ్చి కొట్టినా పల్కడు అన్నమాట తప్ప వాడికి ఏమీ లోపం లేదు.

చివరికి ఎల్లాగో ఓలాగా ఇంటికి చేరుకున్నాడు. ఆరాత్రి ఏమీ నిద్దర పట్టలేదు వాడికి. తరవాత వాడు చాలాసేపు ఆలోచించుకొని వృషభదాసు ఇంట్లోవుండే కొన్ని బట్టలు తీసికోని ఇంకా ఝామురాత్రి ఉండగానే బయలుదేరి పశువుల తోలుకొని సరిగ్గా చారణముని వున్నచోటుకు చేరాడు. ఆతెచ్చిన బట్టలన్నీ ఆయనకు చుట్టబెట్టి పశువుల్ని చుట్టుప్రక్కల తోలి తానుమాత్రం ఆయనకు సేవచేస్తూ ఉన్నాడు. ఇంతలో తెలతెల్లవార వస్తున్నది. ఇంతలో చారణముని కన్ను తెరచి చూశాడు. ఎదట గోపాలుడూ తనకు నిండాబట్టలు కప్పి పరిచర్య చేస్తుండడం గమనించి నవ్వుకొన్నాడు. తర్వాత ఎవరు నీవూ? అన్నాడు. ఉన్నదంతా చెప్పగానే జాలిపుట్టి వాణ్ణి దగ్గరికి తీసికొని "నాయనా! బుద్ధిమంతుడవోయ్. మాడూ నీకు ఒకమంత్రం వుపదేశిస్తాను. దాన్ని నీవు జపంచేస్తుంటే ఎంత కష్టమైన పని అయినా నెగ్గుతుం టుంది సుమా."— అని చెప్పి "ణమో అరిహింతా ణం"— అని ఉపదేశం చేసి వెంటనే వెళ్లి పోయాడు. గోపాలుడు అప్పట్నించీ దాన్ని శ్రద్ధతో జపం చేస్తూ వచ్చేవాడు.

ఒకనాడు గోపాలుడు పశువుల దగ్గరికి వెళ్లకుం డా ఇంట్లోనే వుండవలసి వచ్చింది. అందులోనూ ఆనా డు వృషభదాసు దగ్గరకూర్చోనే పనిచెయ్యాలసి వచ్చిం ది. పనిచేసేప్పుడంతా ముందుగా ఏమో పెదవులు కద లిస్తూ చెయ్యడాన్ని చూచి "ఏమోయ్. ఇంత పొగరు వచ్చిందా? ఏమిటీ గొణుగుతావూ?"— అని ఆగ్రహ పడ్డాడు వృషభదాసు. ఏమీ లేదు— అని మొదట తప్పిం చుకోడానికి మాశినా వృషభదాసుకు ఆగ్రహం హెచ్చి పోతున్నది: ఇక విధిలేక వున్నదంతా చెప్పేశాడు గోపాలుడు. వృషభదాసు మహా ఆనంద పడ్డాడు— భలే! నాకు సేవకు డనిపించావు.— అంటూ అతణ్ణి ప్రేమదృష్టితో ముంచెత్తినాడు. ఎందుకని అంటారా? చెప్పలే సజ్జన లక్షణమే అదీ! కాబట్టే 'సతత స్సత్యం ధర్మానురాగిణః' అన్నారు.

గోపాలుడు ఇట్లామంత్రాన్ని నిరంతరంగా జపిస్తూ తనపనులు తాను నిరభ్యంతరంగా చేస్తున్నాడు. ఈమధ్యకాలంలో ఇంకో చిత్రం జరిగింది. గోపాలుడు మామూలుగా పశువులను తోలుకోని అడవికి పోయేడు. అక్కడికి గంగానది కూతవేటుదూరంలో వుంది. వర్షా కాలం అయినందుచేత ఆరోజుల్లో గంగ ఇద్దరీ అద్దరీ తన్ని పారుతున్నది. గోపాలుడు పరధ్యానంగా పశువుల వెంట వస్తున్నాడు. ఇంతలో పశువులకి అద్దరిని మిసమిస లాడుతూ ఏపుగా పెరిగిన పచ్చికపట్లు కనపడ్డాయి. వెంటనే అవి తోకలెత్తికొని అరుస్తూ ఏటికడ్డంగా పరి గెత్తసాగాయి. గోపాలుడు ఈసంగతి కనిపెట్టేలోప ల్నే దాదాపు ఆవులన్నీ నదిలో దూకినవి. ప్రవాహం చాలా జోరుగా వున్నది. ఏమో ఏమవుతుందో? అనే చింతతో ఆమంత్రాన్ని పఠిస్తూనే గోపాలుడు తా నుకూడా గుభాలున గంగలో దూకాడు. సరిగా ఆసమ యానికే అక్కడ పెద్ద సుడిగుండం ఏర్పడ్డది, ఇదివరకే అందులోకి వచ్చి తల్లక్రిందులుగా ఒకపెద్దతనాబీ తిరుగు తున్నది. గురిమాసి దూకినట్లు ఆమూలం గోపాలుడి డొక్కలో పొడుచుకున్నది. సరి గోపాలుడు మునిగి పోయాడు. ప్రచ్ఛన్న దుర్జనకృత్యంలాగా ఆతనాబీ అతని ప్రాణాలు తీసివేసింది.

ఈవిధంగా చచ్చిపోయిన గోపాలుడి ఆత్మే కొన్నాళ్లకు కర్మశేషంవల్ల అర్హద్దాసీగర్భంలో ప్రవే శించింది. భార్య అపరూపంగా గర్భం ధరించినందుకు వృషభదాసుకు కల్గిన సంతోషానికి హద్దూపద్దూలేదు. ఆ సంతోషాన్ని ఆయన అనేకధర్మకార్యాలవల్ల వెల్లడిం చాడు. చిట్టచివరకు అర్హద్దాసీకి మొగపిల్లడు పుట్టాడు. పిల్లడన్నా పిల్లడా? బంగారపు విగ్రహం. అమిత గారా బంగా పెంచుతున్నారు. పిల్లాడిపేరు సుదర్శనం— అన్నారు. లోకులంతా అన్నారుకదా— ఒక్కపేరే కాదు, రూపం, గుణం, తేజస్సు— అన్నీకూడా సుద ర్శనమే— అని.

క్రమంగా సుదర్శనం పదిపద్ధారు ఏండ్లవాడైనాడు. అందుకు తగ్గట్టే చక్కగా విద్యాబుద్ధులూ—మర్యాదామాన్యతా అబ్బినాయి. కావలసినంత ఐశ్వర్యం. ఓ—బోలెడందఱు హితులూ ఏర్పడ్డారు. మంచి అందం, దానికి మెఱుగుపెట్టే యౌవనం, క్రమంగా అతనిలో జతపడ్డవి. ఇక చెప్పవలసిందేముందీ? వీళ్లూ వాళ్లూ అనేభేదం లేకుండా అంతా అతన్ని రెప్పాలకుండా చూసి మురిసి పోతుండేవాళ్లు. ఊళ్లోవాళ్ల సంగతే ఇల్లావుంటే కన్నతల్లితండ్రుల ఆనందానికి మేర వుందా; చెప్పండీమఱీ.

వృషభదాసు వన్నెవాసీ కల కొడుకుని చూసికొని పొంగిపోతూవున్నా, వైరాగ్యమార్గంలోనుంచి వంచితుడు కాలేదు. కాబట్టి భార్యతో ఆలోచించి, అన్నివిధాలా వియ్యానికి తగ్గ సాగరదత్తశెట్టికూతుర్ని మనోరమను కోడలినిగా చేసికొన్నాడు. తర్వాత మఱికొంతకాలం పోనిచ్చి రాజుగారితో మనవిచేసి తనశెట్టిపదవిని అతనికిఇప్పించి తాను భార్యతోసహా సమధిగుప్తునిఆశ్రమానికివెళ్లి అక్కడ జినదీక్షనుస్వీకరించి మహాఆనందంతో

శ్లో. ధన్యోఽస్మి పుణ్యనిలయోఽస్మి నిరాకులోఽస్మి
శాంతోఽస్మి నష్టవిపదస్మి విదస్మి దేవ!
శ్రీమజ్జినేంద్ర భవతోఽంఘ్రియుగం శరణ్యం
ప్రాప్తోఽస్మి చేదహ మతీంద్రియసౌఖ్యకారి.

అని భజనచేస్తూ సిద్ధిపొందినాడు. నిజమే. విచణుల కృత్య మింతే అంటారు.

సుదర్శనం తర్వాత తన గుణసంపదవల్ల రాజుకు అత్యంతం విశ్వాసపాత్రుడైనాడు. విశ్వాసమంటే కాస్తా కూస్తా గాదు. సుదర్శనం ఒక్కక్షణం దగ్గఱ లేకపోతే ఇఖ రాజుకు మతిపోతుంది. అంతే. దీనిబట్టి తెలిసికోండి. వారిస్నేహం ఎల్లాంటిదో!

రాజుల్తో స్నేహం పాముల్తో చెలగాటం—వకటే అంటారు. రెండూ మొదట చాలా ఆనందమే కలిగిస్తాయి. కాస్తంత మధ్య చిక్కుపడ్డదా అంటే—రెండూకూడా ప్రాణాలు తీసేస్తాయి. ప్రస్తుతం ఈసామెతకి ఉదాహరణంగానే ఉంది సుదర్శనంజీవితం. ఏమంటారా?—రాజుతో మైత్రి రోజుకు రోజూ ఎక్కువ అవుతూండడం మూలాన్ని అతనికి సిరీసంపదా ప్రజల్లోపలుకుబడీ పరపతీ—అన్నీ వున్నాయి. సరే దీనికి ఆనందించాలసిందే.

కాని ఇంకో బెడద పట్టుకొన్నది. రాజుగారి పట్టపుదేవి వుంది వఖ మహాయిల్లాలు. ఆమెకు రాజు ఎంతప్రేమించినా, ఏమేమి చేసినా తృప్తిలేదు. ఆయిల్లాలు 'నాఒగ్నిస్తృప్యతి కాష్ఠానాం' అనేతరహాలోది. సుదర్శనాన్ని చూశేటప్పటికల్లా ఆమెమనస్సు దుర్దర్శనం అయిపోతుంది. ఒళ్లు జలదరిస్తుంది. తర్వాత ఏమిటో ఏంచేస్తున్నదోకూడా తన్నుతాను తెలిసికోలేనంత జడమైపోతుంది ఆ ఆత్మ. ఏంచేస్తుందీమఱీ? విచారిస్తే ఆమె తప్పు ఏమీ కనపడలేదు. న్యాయంగా మొదట నవ్వులూ తుళ్లులూ—ఆ తర్వాత సైగలూ—పిమ్మట రాయబారాలూ సాగించింది. ఏంసాగిస్తే ఏముందీ? పాపం. అవన్నీ—అంధేందూదయముల్, మహాబధిరశంఖారావముల్—అన్నట్లే అయ్యాయి. చిట్టచివఱకు తనదాసీని ఆశ్రయించి ఆమెను ఎల్లాగైనా కార్యం గట్టెక్కించమని ప్రార్థించింది.

అనడానికి దాసీదే. అయినా అది—పేరు నిపుణిక—ఎన్నోవిధాల నీకిది తగదని చెప్పింది. అదలించింది. బెదరించింది. ఏమీ ప్రయోజనం కనపడలేదు. చివఱకి విసిగి సరే ఏలాగో అతన్ని ఇక్కడికి తేవడం నాపని. తర్వాత సాధించుకోవడం మీ వంతే—అన్నది నిపుణిక. ఓ! చాలు. ఈ పాటిచేస్తే అంతా అయినట్టే!—అని చిటికవేసింది రాణి.

తరవాత నిపుణిక సుదర్శనాన్ని వెంబడించే ఉండేది. ఎందుకంటే—కాస్తంత సందు దొరికితే ఈమంత్రం అతనిచెవులో వుపదేశించడానికి! అయితే ఏంచెయ్యాను? ఏమీ సందు దొరకలేదు. ఎప్పుడు చూశినా, ఏవేళ వెళ్లినా రాజూ సుదర్శనం కలసే వుంటున్నారు. ఆఖరుకి వఖనాడు ఎల్లాగైనా ఇవాళ్ల పట్టితీరాలెనని పట్టుదల్తో అతన్ని అనుసరించింది. రాత్రి చాలాసేపు అయింతర్వాత సుదర్శనం రాజుదగ్గఱ సెలవుతీసికొని వెళ్లుతున్నాడు. దాసి అతనివెంట వెళ్లింది. వెళ్లగావెళ్లగా చివఱకు వాళ్లిద్దరూ ఒకరివెనకాల మఱొకరు చొప్పున స్మశానంలోకి

చేరారు. సుదర్శనం అక్కడ కాయోత్సర్గం చెయ్య డానికి కూర్చోబోతూ వెనక్కి తిరిగి చూసేసరికి నిపుణిక వున్నది. విచారిస్తే సంగతీసందర్భం అంతా బోధ పడ్డది. సుదర్శనం ఆమెను గట్టిగా చీవాట్లు పెట్టి తరిమి వేసినాడు. దాసి వెనక్కి వచ్చి రాణితో జరిగినవిషయం యావత్తుచెప్పింది. అయినా ఆమెవదల్లేదు. "సరే! ఉండే చోటు తెలిసిందికదా! ఇఖ ఫరవా లేదు. రేపు ఎల్లాగైనా తీసికోరాక తప్పదు లేకుంటే నిన్ను ఏంచేయిస్తానో! చూచుకో" అన్నదిరాణి. పాపం పచ్చివెలక్కాయపాకంలోబడ్డది నిపుణిక.

మఱ్నాడు రాణీ దాసీ — ఇద్దరూ మాట్లాడుకున్నారు. ఎట్లాగైనా సుదర్శనాన్ని ఆనాడు తేవలసిందే అనుకున్నారు. అయితే ఉపాయ మెల్లా? పోతుటీగ దూరకుండా జనానాకు పహరా ఇస్తుంటారాయెను. అందుకని నిపుణిక ఒకయుక్తి చేసింది పగటిపూటే ఊళ్లో తిరిగి మనిషి అంత ఎత్తుగల మట్టిబొమ్మను సంపాదించింది. దానికి మగవాడివేషం వేసి కనికనిచీకట్లో ఆబొమ్మను బండ్లో పెట్టుకొని జనానాలోనికి వస్తున్నది. పహరా వాళ్లు ఆబండిని చూసి ఆపి పరీక్షించారు. లోపల ఎవడో మగవాడు కూర్చున్నట్టు కనిపిస్తే ఆగ్రహంతో ఆంబండ్లోవున్న బొమ్మని చెయిబట్టుకొని జఱ్ఱున లాగారు. వెంటనే అది క్రిందబడి తుత్తునకలైపోయింది. వెంటనే నిపుణిక లేచి కండ్లెఱ్ఱజేసి అరుస్తూ—"ఇంత పొగరెక్కిందా? రాణీగారు ఇవాళ్ల ఉపవాసం వుండి వరవ్రతం చేస్తూంది. ఆమె ఈబొమ్మను పూజిస్తేనే గాని ఇఖ గంగముట్టుకోదు. అందుకే నేనీబొమ్మను వాల్గురో జులనుండీచేయించి తీసికొచ్చాను. మీరు బద్దలు చేస్తారా? నేను వెళ్లి రాణితో చెబుతాను. వీపులు బ్రద్దలు అవుతాయి"అని ప్రచండంగా ఉపన్యాసం ఆరంభించింది. ఆదెబ్బతో పహరావాళ్లు హడలిపోయి ఆమెను అనేకవిధాల ప్రార్థించారు. చివఱకు ఎల్లాగో సమ్మతించినట్లు నటించి—'అల్లా అయితే నేను మఱోబొమ్మను తెస్తాను. మఱేమీరు అడ్డుకోరుగదా'—అన్నది. "తల్లీ—బుద్ధివచ్చింది. మఱల ఇల్లాంటితప్పుచేస్తామా?" అన్నారు వాళ్లు. నిపుణికకు పట్టరానంత ఉత్సాహం వచ్చింది.

వెంటనే నిపుణిక శ్మశానంలోకివెళ్లింది. అక్కడ అప్పటికప్పుడే సుదర్శనం కాయోత్సర్గాన్ని అవలంబించి వున్నాడు. నిపుణిక కదలకుండా మెదలకుండా కూచున్న వాణ్ణి కూచున్నట్లే బండ్లో పెట్టుకొని అంతఃపురంలోకి వచ్చి రాణీగారి యెదుట సరకు దింపింది. రాణీగారు ఆమెకు చాలా బహుమతులిచ్చి పంపివేసి ఎన్నోవిధాల అతన్ని సమాధిలోంచి చలింప జేయుటకై పాట్లుపడ్డది. ఆలింగనాలూ, గిచ్చుళ్లూ మొదలయిన విద్యఅంథాచేశింది. కాని సుదర్శనుడు కదలకుండా,చలించకుండా ఉన్నాడు. స్థాణువత్ అథవా నల్లచట్టువత్. కాబట్టే పెద్దలు అన్నారు కూడాను:—

'సంతః కష్టశతైశ్చాఽపి చారిత్రాన్న చలంత్యపి.'
—నేమిదత్తుడు.

ఇంతవరకూ వున్న రాణిగారి మోహమంతా చివరకు విసుగెత్తి నిరాశగా మారి క్రమంగా ఒక్కొక్క మెట్టూ ఎక్కి ఇక్కడినుండీ కోపంగా ఆవిర్భవించి చివఱకు ప్రబలమైన ద్వేషంగా అలముకొన్నది. ఇఖ మఱి ఆ ద్వేషాన్ని ఆపుకోలేక దాన్నంతా సాహసంగా మార్చివేసుకొన్నది. వెంటనే ఆమె ఏంజేసిందనుకొన్నారూ! ఒళ్లంతా గిచ్చుకొని గాయాలు చేసికొని పెద్ద పెద్దరాగాలు తీయడం ఆరంభించింది ఆదెబ్బతో అంతఃపురం అంతా ఒక్కమాటు గొల్లుమన్నది. ఒక్క గొల్లుమనడం మాత్రమే గాకుండా ఆ యేడ్పు ఫిరంగి దెబ్బలాగా సూటిగా వెళ్లి రాజుగారి గుండెలకు ఢాంమని తాకింది. దానితో ఆయన బిందరవందరై అంతఃపురానికి పరుగెత్తికొని వచ్చాడు.

రాణిగారు ఆయన్ను చూస్తూన్నే వెక్కి వెక్కి యేడుస్తు సుదర్శనుడు తన్ను బలాత్కరించాడు— అనే మొదలయిన కృతులెత్తుకొని స్వరమున తాళలయాదులు తప్పకుండా గానా బజాయించింది. రాజుగారి వివేకమంథా ఇదివఱకే గంగలో కలిసింది కాబట్టి వెంటనే అతన్ని వురిదీయించడానికి ఉత్తరువిచ్చాడు. అయినా సుదర్శనుడు కదలలేదు. మెదలలేదు. తలార్లు ఆయన్ని తీసికోపోయి అప్పుడే శ్మశానం ఉరిస్తంభానికి కట్టివేసి కత్తులతో ఒఖ్ఖమాటుగా కంఠానికి గురిచూసి కొట్టారు.

కాని ఏంచిత్రం జరిగిందనుకొంటారూ— అప్పుడా కత్తులు పూలమాలలై అతనికంఠానికి చుట్టుకొన్నవి. దేవతలు అతన్ని పూలతో నింపారు.

తర్వాత రాజుగారు ఈసమాచారం తెలిసి అక్కడికి వచ్చి అతన్ని ప్రార్థించి తీసికొనిపోయి యప్పటిలాగానే అతన్ని ఉంచారు. కాని సుదర్శనుడు విరక్తుఁడై తనకొడుకు సుకాంతుడికి ఆ పదవి ఇచ్చి తాను విరక్తుడై అడవులకు వెళ్లి మునియై జైనేంద్రదీక్షను పూని దర్శన జ్ఞాన చారిత్ర తపోత్యాగాదులచే కేవలజ్ఞానము నొంది నిర్బాధకమగు మోక్షపదవి నొందినాఁడు. కనుకనే పండితులు జినుని యిట్లు నుతించుచుందురు గదా!

శ్లో. సజయతి జినచంద్రః కేవలజ్ఞానకాంతిః
ముదిత సకల ధన్యోత్ఫుల్ల నేత్రోత్పలాఢ్యైః;
అసురసురనరేంద్రైః ఖేచరేంద్రైః స్స్వభక్త్యా
శ్రుతజలధిమునీంద్రైః స్సేవిత శ్శర్మదాతా.

౧౦ పంచనమస్కార మంత్రకథ ముగిసినది.

---

# రాధికావిరహము*

మద్దూరి సాంబయ్య గారు

లలితయమునానదీతీర కలితవనుల
నొంటిమెయి నొక్క విరిపొదరింటియందు
నీపయి విరాళిఁ దాపమందెడిని రాధ
నాథ! దయచేయు, మో జగన్నాథ, కృష్ణ!

మోవితేనియ లానుచు ముద్దుగొనుచు
లాలనలుసేయు నిన్నుఁ దలంచి రాధ
మంతనంబున నీకయి మరులుజెంది
దెసలఁ బరికించుచుండె నేతెమ్ము కృష్ణ!

నిన్నుఁ గలయంగవచ్చుచు నెలఁత మిగుల
వడిగ నడువంగఁబోయి కంపంబుఁ జెంది
తొట్రిలుపదాంబుజంబులఁ ద్రోవనడుమ
సోలి పడుచుండె రమ్ము గోపాలకృష్ణ!

వలపు సెగలకుఁ దాళక వెలఁది తెల్ల
తమ్మితూడులె చే కడియమ్ములట్లు
పూని నీతోడఁగూడి సంభోగమందు
నాస జీవించియుండె రావయ్య, కృష్ణ!

మాటిమాటికి నొక వింత మండనంబు
లీలఁగైసేసి తానె శ్రీలోలుఁడనెడు
భావనాపారవశ్యమై పడఁతియుండె
నొక్కపరి చూతుగాని రావోయి, కృష్ణ!

"చెలియ, యిదియేమె తడవయ్యె చెలువుఁ డింక
రాకయుండె నడుమ నుపద్రవములేమి
గలుగఁబోవుగదా" యని పలుమరు నను
నడుగుఁ గడు నాతురత రాఁగదయ్య, కృష్ణ!

కరిమొయిలులీల నలమిన యిరులఁ గాంచి
పతి యిదే వచ్చెనని బాహులతలు సాచి
కౌఁగిలించుచు మై నెఱుంగని వలపున
ముద్దిడుచునుండు మాటి కమ్ముదిత కృష్ణ!

తాను కైసేతఁగాంచి సిద్ధపడియుండి
నీవు వచ్చుట తడవైన నిలువలేక
సిగ్గువిడి నల్వురు వినంగ బిగ్గరగ మ
హార్తితో నేడ్చు రాధ రావయ్య, కృష్ణ!

ఇది జయదేవకవిరచిత
సదమలగీతంబు రసికజనులకు మిగులన్
ముదమొసఁగి కృష్ణుని పయిన్
గదలని సద్భక్తి నిలుపుఁగాతసతమున్.

---

*జయదేవకవి రచిత గీతగోవింద మహాకావ్యమందలి "నాథహరే జగన్నాథహరే" అను ద్వాదశాష్టపదికి అనువాదము.